క్లుప్తంగా

శ్రీరంగనాథుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న స్వామివారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథుడిని బుధవారం పల్లకీలో ఉంచి ఊరేగింపు చేశారు. ఉగాది పండుగను పురస్కరించుకొని దేవాలయంలో ఉదయం స్వామి వారికి బిందెసేవ అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అలంకరణ చేసి అష్టోత్తరనామార్చన, అభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం స్వామి వారిని సతీసమేతంగా గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

25న మార్కెట్ వేలంపాట

మద్దికెర: మేజర్ పంచాయతీ మద్దికెర పరిధిలో 2023–24 సంవత్సరానికి ఏడాది పాటు దినసరి, నెలసరి, వారం, బస్టాండు తదితర మార్కెట్లలో సుంకం వసూలు చేసుకోడానికి హక్కుల కోసం పంచాయతీ కార్యాలయంలో ఈనెల 25వ తేదీన ఉదయం 11:30 గంటలకు సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీహరి బుధవారం తెలిపారు. ఆసక్తి గల వారు రూ.30 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని సూచించారు. గ్రామ పంచాయతీకి బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనడానికి అనర్హులన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కైరుప్పలలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన చలివేంద్రాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరభద్రస్వామి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం గ్రామంలో రెండు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆ పార్టీ నాయకులు విరుపాక్షి, శరవన్న, శ్రీనివాసులు, వీరభద్రి పాల్గొన్నారు.

వెండి ఆభరణాల విరాళం



ఆభరణాల అలంకరణలో ఉలిగమ్మ అమ్మవారు

మద్దికెర: స్థానిక వడ్డె వీధిలో ఉన్న ఉలిగమ్మ అమ్మవారికి కాలువ నాగరాజు, లక్ష్మి దంపతులు 30 తులాల వెండితో తయారు చేసిన ఆభరణాలను బుధవారం ఆలయ నిర్వాహకులు వడ్డె శ్రీనివాసులుకు అందజేశారు. అనంతరం అమ్మవారిని అభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి దాతలకు ప్రసాదం పంపిణీ చేశారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న మాధవస్వామి

వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో వనం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభమైంది. విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేలు బహుమతులందించనున్నారు. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామళ్లకోట మాధవస్వామి ప్రారంభించారు. టోర్నీలో 48 జట్లు పాల్గొన్నాయని, ప్రారంభ మ్యాచ్‌లో రామళ్లకోట, బోయనపల్లె జట్లు తలపడగా రామళ్లకోట విజేతగా నిలిచిందని నిర్వాహకులు మధు, రమణ, పార్థు, శ్రీను, మనోహర్, ఇదుర్, మనోజ్ తెలిపారు.

పంచలోహ కవచం విరాళం

ఆస్పరి: ఆస్పరిలో వెలసిన ఆంజనేయస్వామికి కర్నూలుకు చెందిన యోగేశ్వరరావు, ఆస్పరికి చెందిన దాసప్పగారి అంజినయ్య అనే భక్తులు రూ.65 వేలు విలువ చేసే పంచలోహ కవచం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజారి నిరంజన్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పందెం

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని గ్రామంలో మారెమ్మవ్వ దేవర నిర్వహించారు. అమ్మవారికి భోనాలు సమర్పించుకునే కార్యక్రమంలో భాగంగా బుధవారం పొట్టేళ్ల పోట్లాట నిర్వహించారు. పెద్ద పెద్ద పొట్టేళ్లతో సాగిన పోరు చూపరులను ఆకట్టుకుంది. దేవరల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది.

ఊరూరా ఉగాది సందడి

తెలుగు నూతన సంవత్సరం శోభకృత్ నామ ఉగాది పండుగను గ్రామగ్రామాన ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఇళ్ల గుమ్మాలను మామిడాకుల తోరణాలతో అలంకరించి నూతన వస్త్రాలు ధరించి ఉత్సాహంగా పండుగ చేసుకున్నారు. ఏ ఇంట చూసినా బంధుమిత్రులు, ఆడపడుచులతో సందడి కనిపించింది. ఉదయాన్నే పిండివంటలు వండి గ్రామంలోని దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి మెక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవతలు, స్వాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచులు మేళవించి తయారు చేసిన ఉగాది పచ్చడిని ఇరుగుపొరుగు వారికి పంచిపెట్టారు. మహిళలు ఒడి బియ్యం పోసుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. స్వాముల వారి రథోత్సవాలు, ప్రభోత్సవాలు, ఇతర కార్యక్రమాలతో ఆధ్యాత్మికత నెలకొంది.



వెల్దుర్తి వడ్డె గేరిలో పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు





కడమకుంట్ల చౌడేశ్వరీదేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, గోనెగండ్లలో ప్రభోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నందవరం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జొహరాపురంలో మరెమ్మవ్వ, లింగమయ్య దేవర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం దేవతా మూర్తులకు పిండి వంటలతో భక్తులు నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం జొహరాపురం, మిట్టసోమపురం గ్రామాల్లో ప్రజలు ప్రత్యేకంగా చేసిన నైవేద్యాలను భోనాలలో ఉంచుకొని డప్పు దరువులు, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి సుంకులమ్మ, మారెమ్మ, లింగమయ్యకు సమర్పించారు. పురవీధుల్లో బారులు తీరిన భక్తుల మధ్య కుంభోత్సవం కనువిందు చేసింది. అనంతరం బలిదానాలు కానిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ తెలుగు లక్ష్మిదేవి, ఎంపీటీసీ విజయమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని బుధవారం మండల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కడమకుంట్ల చౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో పంచాగ శ్రవణం నిర్వహించారు.

గోనెగండ్ల: స్థానిక అంజనేయ స్వామి దేవాలయంలో వీరశైవ పీఠాధిపతి శివయ్య స్వామి పంచాంగ శ్రావణంలో రాశిఫలాలు, గ్రహ స్థితిగతులను వినిపించారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని రథంలో కొలువుంచి ఊరేగింపుగా శివాలయం వరకు తీసుకెళ్లి తిరిగి యథాస్థానానికి చేర్చారు.

కృష్ణగిరి: మండలంలో ఉదయమే అన్నదాతలు కాడెద్దులతో పొలాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం పొలాలను ఎడ్లతో సాగుచేశారు. సాయంత్రం పెనుమాడ గ్రామంలో కుందేలు పారువేట కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఆలంకొండలో ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించుకుని బండ్లతో పారువేట నిర్వహించారు. చుంచుఎర్రగుడిలో రామలింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామ వీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం, హంప, ఎడవలి, బసినేపల్లి గ్రామాలలో తెల్లవారుజామున పిల్లలు,పెద్దలు తలంటు పోసుకొని దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్దికెరలోని కవిరెడ్డి, బెస్త వీధులకు చెందిన యువకులు రంగులు చల్లుకుని గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి, హొళగుందలోని వీరభద్రేశ్వర స్వామి, సిద్దేశ్వర స్వామి తదితర ఆలయాలలో పూజారులు జలాభిషేకం, రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన, ఆకుపూజా, మహామంగళారతి నిర్వహించి నైవేద్య సంతర్పణ చేపట్టారు. గజ్జహళ్లి గ్రామంలో ఆచారం ప్రకారం ఆలయాలకు కాషాయ జెండాలను కట్టి వేడుకలు జరుపుకున్నారు. సాయంత్రం హొళగుందలోని విరక్తమఠం, భోగేశ్వరస్వామి ఆలయాల్లో వేద పండితులు గురుశిద్దయ్య స్వామి, వేదమూర్తి స్వామి భక్తులకు పంచాంగం చదివి వినిపించారు.

ఆలూరు: ఆలూరు, మొలగవెల్లి, పెద్దహోతూరు, ముద్దనగేరి తదితర గ్రామాల్లో ప్రజలు, రైతులు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పంచాంగ పఠనకర్తలు, పండితులు దేవాలయాల అరుగుపై కూర్చొని కాలం, పంటలు, గిట్టుబాటు ధరలు, వర్షం, లాభనష్టాలు, రాశి ఫలాలు చదివి వినిపించారు. దేవనకొండ మండలం పి.కోటకొండలో గ్రామస్తులకు జనపాటి శర్మ పంచాంగ పఠనం చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం జిల్లా, నియోజకవర్గ ప్రజలకు తెలుగు నూతన సంవత్సరం శోభకృత్ నామ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

వెల్దుర్తి: స్థానిక కిందిగేరి మారెమ్మ, వడ్డెగేరి సుంకులమ్మ, రామళ్లకోట సుంకులమ్మ అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వడ్డెగేరి సుంకులమ్మ అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక పల్లకీలో ఉంచి చెక్కభజనలతో పురవీధులగుండా ఊరేగించారు. పదో వార్డుకు చెందిన రాధమ్మ అమ్మవారికి వెండి ప్రమిదెలు అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మన దశరథరామిరెడ్డి, బొమ్మన సుబ్బారెడ్డి, మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. రామలింగేశ్వర ప్రభోత్సవం

ఆలూరు రూరల్: మండలంలోని మనేకుర్తి గ్రామంలో కొలువైన రామలింగేశ్వర స్వామి ప్రభోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు ఉదయం నుంచి స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రభోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి వచ్చారు. భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాలు పంచిపెట్టారు.



మద్దికెరలో రంగులు చల్లుకుని వేడుకలు చేసుకుంటున్న దృశ్యం



గజ్జహళ్లిలో ఆలయాలకు కాషాయ జెండాలను కట్టెందుకు తీసుకెళ్తున్న చిన్నారులు



గోనెగండ్లలో ప్రభోత్సవం ముందు కోలాటం ఆడతున్న చిన్నారులు



ఆస్పరిలో జనార్థనస్వామి రథానికి అలంకరించేందుకు గజమాల తీసుకెళ్తున్న ముస్లిం యువకులు

కనులపండువగా రథోత్సవం



వందవాగిలిలో దుర్గమ్మవ్వ రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

హొళగుంద: మండల పరిధిలోని బీజీ హళ్లి, పెద్ద గోనేహాళ్, హెబ్బటం, వందవాగిలి గ్రామాలలో వెలిసిన రామలాంభికదేవి, సుంకలమ్మ దేవి, సవారమ్మ, దుర్గమ్మవ్వ రథోత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఉదయమే అమ్మ వార్లకు గంగి పూజ, జలాభిషేకాలు, ఆకు పూజ, మహా మంగళారతి, నైవేద్య సమర్పణ తదితర కార్యక్రమాలు జరిగాయి. వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులను తీర్చుకున్నారు.

రమణీయం.. రథోత్సవం

ఆస్పరి: ఆస్పరిలో జనార్ధన స్వామి రథోత్సవం బుధవారం అశేష జనవాహిని మధ్య వైభవంగా జరిగింది. ఆలయ పూజారి నరసింహయ్య ఆధ్వర్యంలో రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీదింటి వీరశేఖర్‌రెడ్డి ఇంటి నుంచి కుంభాన్ని మేళతాళాలతో ఆలయం వరకు ఊరేగించారు. అనంతరం పల్లకీ సేవ, జనార్ధన స్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి మేళతాళలు, బాణాసంచా పేలుస్తూ స్వామి వారి రథాన్ని కొల్లాపురం అవ్వ దేవాలయం వరకు లాగారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఆస్పరిలో వెలసిన మారెమ్మను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నగరూరులో మారెమ్మవ్వ రథోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు రథాన్ని గ్రామం చివరి వరకు లాగారు.



ఆస్పరిలో అశేష జనవాహిని మధ్య కదులుతున్న జనార్ధన స్వామి రథం

గజమాల సమర్పించిన ముస్లింలు

ఆస్పరిలో జనార్ధన స్వామి రథోత్సవానికి స్థానిక ముస్లిం యువకులు గఫూర్, వలీబాషా, ఇదృష్ బాషా, షాషావలి, తదితరులు భారీ గజమాల సమర్పించి ఐక్యతను చాటారు. అలాగే హమాలీ సంఘం, మొక్కుబడి ఉన్న భక్తులు స్వామి రథానికి పూల దండలు వేసి అలంకరించారు.

హోరాహోరీగా ఎద్దుల పోటీలు



చిప్పగిరిలో బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం



పెరవలిలో పోటీలను ప్రారంభిస్తున్న గ్రామపెద్దలు

చిప్పగిరి: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని డేగులహాలు గ్రామంలో బుధవారం ఎంపీపీ జూటూరు హేమలత, సర్పంచ్ నీలకంఠ ఆధ్వర్యంలో ఎద్దులబండ్ల పోటీలు నిర్వహించారు. మొత్తం 24 జతల ఎడ్లు పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో సల్లాపురం బాలయ్య చెందిన ఎద్దులు నిర్ణీత 1.50 కి.మీ దూరాన్ని 2.19 నిమిషాలలో చేరుకుని విజేతగా నిలిచాయి. నాగేంద్ర ఎద్దులు 2.21 నిమిషాలలో, యర్రగుడి సురేష్, రఘుకు చెందిన ఎద్దులు సంయుక్తంగా 2.22 నిమిషాలలో గమ్యం చేరుకుని తరువాతి స్థానాల్లో నిలిచాయి. విజేత వృషభాల యజమానులకు రూ.20 వేలు నగదు, 20 తులాల వెండి, రెండో బహుమతి రూ.15వేలు, 15 తులాల వెండి, మూడో బహుమతి రూ.10 వేలు, 10 తులాల వెండి అందజేశారు. దాతలు మారయ్య, గోవిందరాజులు, తిమ్మయ్య నగదు బహుమతులు అందించగా, వెండి బహుమతులను దాతలు సతీష్, ప్రతాప్, చంద్ర అందించారు. నిర్వాహకులు లాల్‌స్వామి లింగన్న, రైతులు పాల్గొన్నారు.

వృషభాల బండలాగుడు పోటీలు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో గర్భగడ్డ యూత్ ఆధ్వర్యంలో బుధవారం వృషభాల రాతిదూలం లాగే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఏడు జతల ఎడ్లు పాల్గొన్నాయి. నిర్ణీత సమయంలో రాతిదూలాన్ని ఎక్కువ దూరం లాగి మొదటి బహుమతి రంగనాయకులు, రెండవ బహుమతి రామాంజనేయులుకు చెందిన ఎద్దులు గెలుచుకున్నాయి. రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరు అఖండ దీపాలు



సోమలింగేశ్వర స్వామి ఆలయంలో వెలుగుతున్న అఖండ దీపాలు



మూసానహళ్లిలో సోమలింగేశ్వర ప్రభోత్సవ దృశ్యం

ఆలూరు రూరల్: పని మీద బయటకు వెళ్లేటప్పుడు కొందరు శుభ ముహూర్తం చూసుకుంటారు. మరికొందరు సెంటిమెంట్‌తో తమకు ఇష్టమైన వారిని ఎదురుగా రమ్మంటారు. ఆ ఊరిలో మాత్రం ఆలయంలో అఖండ దీపాలు చూడనిదే గ్రామస్తులు పొలిమేర దాటరు. శుభకార్యాలకు వెళ్లరు. పొలాలకు వెళ్లాలన్నా దీపాలు చూడాల్సిందే. అఖండ దీపాలు వరుస క్రమంలో కనిపించకపోతే తమ పనులను వాయిదా వేసుకుంటారు. ఇలాంటి సాంప్రదాయానికి అద్దం పడుతున్న ఆ గ్రామం ఆలూరు మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. గ్రామం పేరు మూసానహళ్లి. 300 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ గ్రామానికి మరో ప్రత్యేకత ఉంది. మహాయోగి లక్ష్మమ్మ అవ్వ పుట్టిన గ్రామం ఇది. శతాబ్దాల క్రితం మూసానహళ్లి గ్రామంలో శ్రీ సోమలింగేశ్వ స్వామి కొలువయ్యాడు. ఆయన అప్పట్లో ప్రజలకు మహిమలు చూపించాడని గ్రామస్తులు చెపుతున్నారు. ఆలయంలోని అఖండ దీపాలు ప్రాచీన కాలం నుంచి నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. దీపదూప నైవేద్యానికి 40 ఎకరాల భూమిని గ్రామ పూర్వీకులు కేటాయించారు. ప్రస్తుతం ఆ భూమిని ఆలయ అర్చకులు సాగు చేసుకుంటున్నారు. అఖండ దీపాల కోసం నూనెను గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి కుటుంబీకులు అందిస్తున్నారు. గ్రామంలో 70 శాతం వరకు ప్రతి ఇంట్లో సోమలింగేశ్వర స్వామి పేరు కలిగిన వ్యక్తులు ఉన్నారు. నిత్యం ఆలయ తలుపులు తెరుచుకొని ఉంటాయి.

భక్తిశ్రద్ధలతో ఉగాది పూజలు: గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా సోమలింగేశ్వర స్వామి ప్రభోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు



కడమకుంట్లలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

తుగ్గలి: క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడుతాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా తుగ్గలి మండలంం కడమకుంట్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహిళల కబడ్డీ పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని కొద్దిసేపు సరదాగా వారితో కబడ్డీ ఆడారు. పోటీలలో గుజరాత్, కేరళ, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మొత్తం 14 జట్లు పాల్గొన్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమి చెందినవారు నిరుత్సాహానికి గురికాకుండా నిరంతరం శ్రమిస్తే ఏదో ఒకరోజు విజయం ఖాయమన్నారు. ఫ్యాక్షన్ గ్రామమైన కడమకంట్లలో జాతీయ స్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రామచంద్రారెడ్డి, నాగేష్, పులికొండనాయక్, మోహన్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, హనుమంతు, మల్లికార్జునరెడ్డి, నాగప్ప, ఉమామహేశ్వరరెడ్డి, సునీత, ఆదిలక్ష్మి, రామాంజినేయులు పాల్గొన్నారు.

పురుషుల కబడ్డీ విజేత బాయిపల్లె

తుగ్గలి: ఉగాది పండుగ సందర్భంగా కడమకుంట్లలో నిర్వహించిన పురుషుల కబడ్డీ పోటీల్లో ప్యాపి లి మండలం బాయిపల్లె జట్టు విజేతగా నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్‌లో కడమకుంట్ల జట్టుతో పోటీ పడి గెలిచింది. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను నిర్వాహకులు అందజేశారు. సర్పంచ్ మస్తాన్‌బీ, సీపీఐ మండల కార్యదర్శి సుల్తాన్, మాజీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, హనుమంతు, బహుమతి దాతలు సయ్యద్ సుల్తాన్, చిట్టి మస్తాన్‌వలి, కొండ రాముడు, సురేష్, చిన్నబాషా పాల్గొన్నారు.

పరిధులు దాటుతున్న ఆర్‌ఎంపీ

హొళగుంద: మండల కేంద్రంలో ఓ ఆర్‌ఎంపీ పరిధి దాటి రోగులకు వైద్యం అందిస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా చిన్నారులకు సైతం సెలైన్ పెట్టడం, క్లిష్టమైన రోగాలకు వైద్య చికిత్స అందిస్తూ ప్రాణాల మీదకు తెస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రక్తహీనత, దీర్ఘకాలికి వ్యాధులకు కూడా తన ఆయుర్వేద వైద్యంతో నయం చేస్తానని చెబుతూ క్లినిక్‌లో మైనర్ ఆపరేషన్లు, కాన్పులు కూడా చేస్తున్నట్లు సమాచారం. ఈయన వద్దకు ఎక్కువగా గ్రామీణ ప్రాంతానికి చెందిన రోగులు వస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఆర్‌ఎంపీ వైద్యుడు పరిధి దాటి అందిస్తున్న వైద్యం వల్ల ప్రాణాంతకంగా మారే అవకాశాలున్నాయని గ్రామస్తులు అంటున్నారు. రోగుల ప్రాణాలతో చలగాటమాడుతున్న సదరు ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతిని విచారించగా.. సదరు ఆర్‌ఎంపీ గురించి విషయం తెలిసిందని విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్‌ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాల్సి ఉంటుందన్నారు.



ఆర్‌ఎంపీ క్లినిక్‌లో చిన్నారికి సెలైన్ పెట్టిన దృశ్యం

నేడు పంచాయతీ వేలాలు

వెల్దుర్తి: స్థానిక మేజర్ పంచాయతీలో వివిధ వ్యాపార హక్కులకు సంబంధించి గురువారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఈఓ/ఈఓఆర్డీ నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు. వేలాలలో పాల్గొనదలచినవారు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. వారపు సంత వేలంలో పాల్గొనేందుకు అదనపు డిపాజిట్‌తో కలిపి రూ.4,65,000 చెల్లించాలన్నారు. అలాగే దినకూరగాయల మార్కెట్ వేలానికి రూ.3,65,000, బస్టాండు పార్కింగ్ ఫీజు రూ.9,27,000, మాంసపు మార్కెట్ రూ.1,55,000, కూరగాయల, మాంసపు అంగళ్లు రూ.11,000, ఎనిమిది షాపింగ్ రూములకు రూ.1,57,500 చెల్లించి పాల్గొనాలన్నారు. వేలంలో హక్కులు దక్కించుకున్న వారు 3 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

1 నుంచి కబడ్డీ పోటీలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో శ్రీరామ నవమి జాతర పురస్కరించుకొని వైఎస్సార్ యూత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ఈరన్న, బీసుపల్లి, రవి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, గ్రామ నాయకులు సిబి.జానకిరామిరెడ్డి, డి.సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరగనున్నట్లు చెప్పారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.20 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు అందచేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల జట్లు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 31వ తేదీ లోపు జట్టు పేరు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 91821 48165, 82472 30953, ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

30న రాష్ట్రస్థాయి భజన పోటీలు

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈ నెల 30న రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. 30న రాత్రి 9 గంటలకు భక్తి భజన పోటీలు ఉంటాయని, పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ.20 వేలు, రూ.18 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యి నగదు బహుమతులను దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే వారు ఆదే రోజు సాయంత్రం 6 గంటల్లోపు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 97014 47250, 96664 55417 నంబర్లను సంప్రదించాలని కోరారు.